# ఈజన్మకీ వరం చాలు

వందనసూరు !

కావలి - బిట్రగుంటల మధ్య ఓ రైల్వేస్టేషన్.

ఆ స్టేషనుకు ఓ ఫర్లాంగు అవతల పని జరుగుతున్న, సిగ్నల్ కు సమీపంలో ఉన్న ఓ నిమ్మతోట ముందు నిలబడి గట్టిగా సిగరెట్ దమ్ము లాగాడు అప్పలనరసింహం.

తన ఎదురుగా రైలు పట్టాలు.

సమానాంతరంగా మద్రాసు నుండీ హౌరాకు ప్రయాణం చేస్తున్న ఇద్దరు ప్రయాణీకులు వీళ్ళు.

వీళ్ళకు తనూ, తన లాంటి కొన్ని వందలమంది ఇనస్పెక్టర్లు రక్షణ !

స్లీపర్లు తొలగినా, ఫిష్ ప్లేట్స్ పోయినా, సిగ్నల్స్ చెడిపోయినా తన కళ్ళల్లో పడవలసిందే. తక్షణం బాగు కావలసిందే !

తృప్తిగా అప్పల నరసింహం పొగను బయటకు వదిలి, మేఘాలు సృష్టించి అనుకున్నాడు - 'నేను నిజంగా దేశానికి చాలా సేవ చేస్తున్నాను' అని.

అయితే, ఈ సేవా సిద్ధాంతంతో అనూరాధ ఎప్పుడూ అంగీకరించలేదు. 'ప్రతివారికీ ఈ రోజుల్లో దేశసేవ అన్నదో ఊతపదమైపోయింది - అందరూ చేస్తున్నది ఉదార సేవ మాత్రమే' నంటుంది నిర్మొగమాటంగా అనూరాధ. 'కలికాలంలో, ఆకలి కాలంలో కూటికోసం కోటి విద్యలండీ. మీ జీతం రాళ్ళకోసం, భార్య కోసం మీరు రైల్వే ఉద్యోగం చేస్తున్నారు. ఇందులో దేశసేవ ఏముందండీ ?' సూటిగా ప్రశ్నించింది లోగడ అనూరాధ ఓ సారి తన్ను. నిజమే ననిపించింది తనకు.

ఈ అనూరాధ ప్రశ్న తనకే కాదు వ్యాపారస్థులకూ, ఉపాధ్యాయులకూ, రాజకీయ నాయకులకూ - అందరికీ వర్తిస్తుందికూడా అనుకున్నాడు నరసింహం.

ఎదురుగా ట్రాలీ నడుస్తున్నది.

కూలీలు పని సాగిస్తున్నారు, ఓ జానపద గేయం పాడుతూ.

నరసింహం మళ్ళీ ఆలోచనలో పడ్డాడు.

అయినా, ఈ మధ్య అనూరాధకు తెలివి మరీ ఎక్కువైంది. చూస్తున్నాడుగా.

కాపురానికి వచ్చిన కొత్తల్లో మరీ ఇంత వికాసం లేదు.

నిజానికి ఇప్పుడామె మాట్లాడే భాష తనకు ఒక్కొక్కప్పుడు అర్థమే కాదు.

"మీరు అపార్థం చేసుకుంటున్నారు" అంటుంది.

"ఈ మధ్య మీకూ, నాకూ మధ్య గాలి బరువుగా వీస్తోంది" అంటుంది.

"హృదయానికీ, అధరానికీ సంబంధమే లేదు. దేని అదృష్టం దానిదే" అంటుంది.

"ఊహలు పరిమళించేటప్పుడు హృదయాలు మొగ్గల్లాగే ఉంచాలని ఎందుకనుకుంటారు ?" అటుంది.

"బలవంతంగా మీరో పులిని పట్టుకొని చంపవచ్చు. కాని, బలవంతంగా ఓ మొగ్గను పువ్వుగా మార్చగలరా ?" అని ప్రశ్నిస్తుంది.

ఏమి విచిత్రమైన వాక్యాలు.

ఎంత చక్కని కొటేషన్లు ?

ఎక్కడివి ఇవన్నీ ? ఎలా వచ్చింది ఈమె కింత పాండిత్యం ?

అప్పల నరసింహానికి ఇంకా అంతుచిక్కని ప్రశ్నల్లో ఇదొకటి :

"జీవితం అంటే ఆవకాయలు పెట్టుకోవడాలూ, అన్నం వండుకోవడాలేనా ? అలా అలా నాజూగ్గా వెన్నెల గీతం పాడుకుంటూ బతకడంలోనే సార్థక్యం ఉంది డియర్" అన్నది అనూరాధ చాలాసార్లు.

అయితే ఈ వెన్నెల గీతం ఏమిటో, అన్నం వండుకోవడం మానేసి కేవలం అది పాడుకుంటూ బతకడంలో ఉన్న సార్థక్యం ఏమిటో నరసింహానికి నేటి వరకూ ఎలా ఆలోచించినా అర్థం కాలేదు.

ఉన్నట్టుండి అనూరాధ అంటుంది : 'ఈ నాలుగు గోడల మధ్య బతకడం జీవితం అనిపించుకోదు. విశాల విశ్వమే నా ఇల్లు. ప్రశాంత పవనమే మన నెచ్చెలి;

ఆకాశమే పెద్ద గుడారం - తారాహారమే నాకు మణిహారం."

ఇలాంటి కవితామయమైన పంక్తులు ఈమెకు ఎలా అలవడ్డాయి??

అనూరాధ ఇటీవల కిరాయి లైబ్రరీనుండి పుస్తకాలుతెప్పించి విపరీతంగా చదువుతున్నది. బహుశా దాని ప్రభావమే ఇది కాబోలు- అనుకున్నాడు నరసింహం!!

భోజనం చేద్దామని కేరియర్ తీశాడు.

ఓ దుప్పటిక్రింద పరిచి దానిమీద గిన్నెలు పెట్టాడు.

ఓ విస్తరి వేసి అందులోకి అన్నం వడ్డించుకున్నాడు.

ఇంతలో వేగంగా అవతలి లైనుమీద ఓ ఎక్స్‌ప్రెస్ రైలు నాన్-స్టాప్ వెళ్ళింది.

దాని వేగానికి సుడిగాలి కెరటాలు కెరటాలుగా చుట్టూ వ్యాపించింది.

ఇసుకా, దుమ్మూ, ఎగిరివచ్చి అన్నంలో పడింది.

పుల్లలూ, పిచ్చికాగితాలు కూరమీద సాంబారు గిన్నెమీద పడ్డాయి.

పక్కనే ఓ కుక్క రడీగా కూర్చొని వుంది.

నరసింహం, దుమ్ము పడ్డంతమేరకూ అన్నం తీసి అవతల వేయాలని ప్రయత్నించాడు. కాని సాధ్యపడలేదు.

ఎందుకో ఇక తిన బుద్ధివేయలేదు.

కొంచెం మంచినీళ్లు తాగాడు.

'ఇదేం జన్మ - ఇదేం జీవితం.' అనుకొన్నాడు. ఓక్షణం!!

కృష్ణాజిల్లాలో ఓ ముసునూరు అనే వూరు వుంది. దానిని పదమూడవ శతాబ్దంలో కాపయనాయకుడు - ప్రోలయనాయకుడు అనే రాజులు పరిపాలించారని చరిత్రలో వ్రాసి వుంది. అనూరాధ ముసునూరు పేరు ఎక్కడో చదివింది. ఈవూరే ఆ ప్రాచీన నగరం అనుకున్నది - అందుకే భర్త ముసునూరు వెళ్ళేటప్పుడల్లా 'రాజావారూ' అంటూవుంటుంది.

ఆమె రాణి.

తనొక రాజా! అప్పల నరసింహరాజా! అనూరాధా వల్లభుడు!!

ఈ రాజావారి బ్రతుకు ఇంత దివ్యంగా వుంది.

తిన తిండిలేదు - కంటికి నిద్రలేదు. శారీరకంగా అలసట, మానసికంగా అలసత!

ఆరోజు ఏ అర్ధరాత్రి దాటిన తర్వాతనో పని ముగించుకొని ఏదో రైలు పట్టుకొని ఇంటికి చేరాడు నరసింహం. ఒళ్ళంతా నలిగిపోవడంతో తెలియకుండా నిద్రపట్టింది.

ఉదయం లేచేసరికి కొంచెం పొద్దు ఎక్కింది.

అవతల అనూరాధ సుప్రభాతాలు ముగిశాయి.

పిండి రంగడు రుబ్బాడు నిన్ననే.

కొబ్బరి చట్నీ వెంకడు దంచాడు ఉదయమే.

కారప్పొడి సాంబరుపొడి ముందే దంపించి డబ్బాలకు పట్టి పెట్టుకుంది అనూరాధ.

నరసింహం ముఖం కడుక్కొని డైనింగ్ టేబిల్ ముందు కూర్చున్నాడు.

'రాత్రి ఎక్స్‌ప్రెస్ రెండుగంటలుఆలస్యమైందేమిటండి-ప్రభువులవారూ!'

నరసింహం రేషన్ పట్టుకొని వెంకన్నతో మునునూరువైపు డ్యూటీకి బయలుదేరినప్పుడల్లా అనూరాధ పరాచికంచేస్తూ ఉంటుంది- 'ప్రభువులవారు ప్రోలయ నాయకుని సామ్రాజ్యం వేంచేస్తున్నారు' అని.

'రాధా! నేనో నిశ్చయానికి వచ్చాను.'

'ఏమిటండోయ్ అది?' కాఫీ కలుపుతూనే ప్రశ్నించింది అనూరాధ.

'నేనీ దరిద్రపు ఉద్యోగం ఇక చేయలేను.'

'అదేమిటి?'

'ఔను! జన్మంటూ ఎత్తాక వేళకింత తిండికీ, నిద్రకూ కూడా నోచుకోక పోతే ఏం బతుకు? ఏదైనా ఆఫీసు డ్యూటీకి మార్చుకుంటాను.'

'ఆఫీసు ఉద్యోగాలు మనకోసం కనిపెట్టుకొని ఉన్నాయా ఏమిటి?'

'అడిగి చూస్తాము - లేకుంటే అది వేరే మాట... '

'టి.ఎ., డి.ఎ.లు దొరకనప్పుడు'

'మహారాణీగారూ! ముష్టి టి ఏ., డి ఎ.ల కోసమే మనం జీవించడం లేదుగా.'

'అని నే ననలేదుగా, మహారాజావారూ! ఈ అనవసరపు వేడుక మాటల కేమిగాని, మధ్యాహ్నం రంగమహల్ లో మంచి ఇంగ్లీషు మ్యాట్నీ ఉంది వెళదామా....'

"మ్యాట్నీ మాట అటుంచి. నేను చెప్పేది సీరియస్‌గా ఆలోచించు.'

'ఈ వేళాకోళం.'

'వేళాకోళం కాదూ, పిండాకూడూ కాదు. నేను నిన్న ముసునూరులో కాపయ ప్రోలయ నాయకుల సాక్షిగా తీసుకున్న నిర్ణయం ఇది . ఆఫీసు ఉద్యోగానికి మార్చకపోతే రిజైన్ చేసి వేరే జాబ్ వెతుక్కుంటాను.'

చకితురాలైంది అనూరాధ.

'అయితే, మీరు అనేదంతా నిజమేనన్నమాట.'

'నిజం. నిజం నూటికి నూరుపాళ్ళు నిజం. హరిశ్చంద్రుడిమీద ప్రమాణం చేసి చెపుతున్నాను, నన్ను నమ్ము.'

అనూరాధ డైనింగ్ టేబిల్ కుర్చీని ఇవతలకు లాక్కొని బుగ్గలు నొక్కుకుంటూ అన్నది: 'మీకు ఇదేం బుద్ధి? ఎప్పుడూ మీ నోటినుంచి నే నిలాంటి మాటలు వినలేదు.'

'అవును. అందరూ అన్ని మాటలూ ఎప్పుడూ అనరు. చాలాసార్లు అనుకుంటూ ఉంటారు. అలా అనుకొని అనుకొని చివరకు ఎప్పుడో అనేస్తారు పైకి. ఆ అనేయడం ఇవ్వాళ జరిగింది. అంతే.'

'అయితే ఈ క్వార్టర్సూ ఈ పనిమనుషులూ, కాశ్మీరం నుంచి కన్యాకుమారి వరకు ఫస్టుక్లాసులో తిరిగే ఈ పాసులూ మొత్తం గంగార్పణం చేస్తారా?'

'గంగార్పణం కాదు; నువ్వుల నీళ్ళతో పినాకినీ అర్పణం చేస్తాను.'

'సుఖమంటే మీకెందుకింత విరక్తి కలిగింది.'

'ఎవడికి సుఖం, అనురాధా! పిడుగులుపడే వర్షాకాలంలో, ఎముకలు కొరికే చలిలో, పిట్టలు రాలిపడే గ్రీష్మపు ఎండల్లో రైలు బద్దీల కంటిపెట్టుకొని చెయ్యని నేరానికి జీవితాంతం శిక్ష ననుభవించే నాకు సుఖమా? సుఖం నీది. నీకు ఎయిర్ కూలర్ ఉంది. ఫ్రిజ్ ఉంది. అన్నం దింపేందుకొక పని

మనిషీ, అప్పడాలూ వడియాలూ వేయించి పెట్టేందుకొక పనిమనిషి ఉన్నారు. సుఖమంటే విరక్తి కలిగి కాదు - ఈ కష్ట నిష్ఠ దరిద్రపు జీవితం దుర్భరమై ఈ నిర్ణయం తీసుకున్నాను. అర్థమైందా?' ఖాళీ కాఫీకప్పును డైనింగ్ టేబిల్ మీద అవలకు నెడుతూ అన్నాడు.

అనూరాధ ముఖం కందిపోయింది. టపటప కండ్ల వెంట రెండు నీటిబొట్లు రాలాయి.

నూఁవేసి కారప్పొడి కలుపుకొని ఇడ్లీ పెట్టుకొని తెచ్చుకున్న ప్లేటును డైనింగ్ టేబిల్ మీద విసిరి పడేసి బెడ్ రూంలోకి వెళ్ళింది

ఫెడీమని తలుపు మూసుకుంది

నరసింహం ఈ అకాల వర్షాగమనానికి ఏమీ భయపడలేదు. చలించ దలచుకోలేదు.

మామూలుగానే షేవింగ్ చేసుకున్నాడు.

స్నానం చేశాడు.

ఇంగ్లీషు పేపర్ పేజీలు తిప్పాడు.

వెంకన్న, రంగడు జోడు గుర్రాల్లా పడి వంటలు చేసేస్తున్నారు. అయ్యగారు ఇంట్లోనే ఉండటంవల్ల రంగడు రవ్వ కేసరి స్పెషల్ చేశాడు.

వెంకన్న ఫ్రూట్‌సాలడ్ చేసి ఫ్రిజ్‌లో పెట్టాడు.

పోస్టుమాన్ ఉత్తరాలు వేసి పోయాడు.

హైదరాబాదునుండి తారకం వ్రాసిన జాబు వచ్చింది. వెంటనే లెటర్ పాడ్ తీసుకొని మిత్రుడు తారకానికి తనకేదైనా జాబ్ చూడవలసిందిగా జాబు వ్రాశాడు.

కాప్‌తో పెన్ మూసేసి ఓసారి వళ్ళు విరుచుకుని టైమ్‌పీస్ వంక చూచాడు.

పన్నెండున్నర అయింది

అంటే అనూరాధ కోపగృహానికిచేరి అప్పుడే అయిదు గంటలయింది.

ఎంత అదృష్టవంతురాలు.

పగటిపూట నిరవధికంగా ఇలా పడుకోగలిగే సౌభాగ్యం....

ఏ జన్మలో పెట్టి పుట్టిందో.

'రాధా, రాధా!'

తలుపు తట్టాడు.

సమాధానం లేదు.

'ఇదుగో, భోజనానికి లే. అప్పుడే పన్నెండున్నర అయింది.' తలుపు నాలుగైదుసార్లు కొట్టాడు.

ఇక ఇవ్వాళ ఉపవాసమేనని నిరాశ చేసుకునేలోపల మోక్ష ద్వారాలు తెరుచుకున్నాయి.

గడియ తీసి అనూరాధ మళ్ళీ మంచంమీద ముసుగు పెట్టుకొని పడుకుంది.

'లే. భోజనం చేద్దాం.'

నాలుగైదుసార్లు పిలిచాడు.

చివరకు అనురాధ మెల్లిగా ఇటు కదిలి, 'వెంకన్నా! రంగడూ' అని కేక వేసింది.

'అమ్మగారూ' ద్వివచనంలో పలికారు

'మీరిద్దరూ ఇళ్ళకు వెళ్ళిపోండి.'

'చిత్తం.' ఎవడికి కావలసిన అన్నమూ, కూరా వాడు గిన్నెలో పెట్టుకొని తమ స్వంత ఇళ్ళకు పోయారు.

ఇల్లంతా నిశ్శబ్దం, టైమ్‌పీసు మాత్రం టక్ టక్ మని చేస్తున్న శబ్దం తప్ప.

అనూరాధ అన్నది, 'మీరు వెళ్ళి భోజనం చేయండి.'

"అంటే?"

'నాకు ఒంట్లో ఏమీ బాగాలేదు.'

'అదేమిటి పొద్దున నేను కాఫీ తాగుతున్నప్పటిదాకా బాగానే ఉన్నావు.'

'కావచ్చు. ఇప్పుడున్న వాళ్ళు మరుక్షణంలో ఉంటారని ఏమిటి నమ్మకం?

దేహాలు అలాంటివి. ఎప్పుడైనా అనారోగ్యం రావచ్చు.'

'ఇంతకూ నీకేం జబ్బు?'

'వెటకారాలూ, వెక్కిరింతలూ కట్టిపెట్టండి. మీ వెర్రి మొర్రి నిర్ణయాల వల్లనే నా బతుకిట్లా బండలవుతున్నది.'

'ఔరా, ఔరా' అనుకున్నాడు నరసింహం.

'ఏం బండలయినట్టు ఇప్పుడు ?' పైకే అన్నాడు నరసింహం ఈ మాట.

'ఇంకేంకావాలి తీర్చిదిద్దిన సంసారాన్ని ఛిన్నాభిన్నం చేయడానికి తిక్క తిక్క నిర్ణయాలు తీసుకోవడాన్ని ఏమనాలి ?'

'నాది నిజంగా తిక్క నిర్ణయమా ?' గుడ్లు మిటకరించాడు నరసింహం. పరుపు మీద చేతులు వెనుక్కు ఆనించి కూర్చుంటూ.

'కాదా ! శ్రద్ధగా వినండి. ఉద్యోగం పురుషలక్షణమని చెప్పారా లేదా?'

'చెప్పారు. అందుకు మరో ఉద్యోగం....'

'దయచేసి మాట్లాకుండా నా మాటలు నాలుగు వినండి. అలాంటిది ఉద్యోగం ఏదైనా సరే చేయడానికి మగవాడు తయారు కావాలి.'

'కానీ రైలుబద్దీల....'

'దయచేసి మాట్లాడకండి. మీరు పొద్దుగూకులూ ఆధ్యాత్మిక దృష్టి ఆధ్యాత్మిక దృష్టి అంటారే - భగవద్గీతలో కృష్ణుడు ఏమి చెప్పాడు ? కర్తవ్యం నుంచి పారిపొమ్మని చెప్పాడా ? స్వధర్మం శ్రేయస్సునిస్తుందని చెప్పలేదా ?'

'అది కాదు,'

'ఏది కాదు ? మీరొకవేళ ఈ ఉద్యోగం మానుకున్నా దాని స్థానంలో మరొకరు రావలసిందే కదా. వాళ్ళకు మాత్రం ఈ కష్టం తప్పుతుందా ? కొంచెం ఇంగితం ఉపయోగించి స్థితప్రజ్ఞత్వంతో ఆలోచించండి. మీ కష్టాన్ని ఇతరుల నెత్తిమీదికి నెట్టడం వేదాంత మనిపించుకుంటుందా ?'

'వేదాంతమూ గాడిదగుడ్డూ.' మండిపడ్డాడు నరసింహం.

అనూరాధ లేచి కూర్చుని డన్‌లప్ పిల్లో ఒళ్ళోకి తీసుకొని దానిమీదికి రెండు మోచేతులూ ఆనించి అరచేతుల్లో గడ్డం మోపి, ఇలా అన్నది :

"మీబాధ నాకు తెలుసు అంతా ఎయిర్ కండిషన్డ్ రూముల్లో కూర్చొని ఉంటే మీకీ కష్టం ఎందుకూ అని-అందరూ పల్లకీ ఎక్కేవారే అయితే మరి మోసేవారు ఎవరు? అయితే, ఆ మోసేవాళ్ళలో నేమా ఒక్కణ్ణి ఎందుకు కావాలి? అని మీ వాదం. అందరూ ఇలా అనుకుంటే ఈ సృష్టి ఎలా నడుస్తుంది ? పూలదండలకేం, ప్రతి పనికిమాలినవాడూ మెడ వంచుతున్నాడు. ముళ్ళబాటలో నడవమంటేనే ఎవరూ ముందుకురారు. అలా కష్టాలను కోరి తెచ్చుకుని వీరోచింతగా, హీరో చితంగా బ్రతుకుతో పోరాడిన వాళ్ళే ధృవతారలుగా చరిత్రలో మిగిలిపోతారు. వాళ్ళే జీససులు, శివాజీలు, రాణాప్రతాపులు.'

నివ్వెరపోయి వింటున్నాడు నరసింహం అప్రతిభుడై.

అనూరాధ మళ్ళీ కొనసాగించింది సంభాషణ : 'మీరు చేసేది . నిజం మాట్లాడితే - నిష్కామకర్మయోగం కూడా కాదు. మీ వల్ల మీ కుటుంబం మొత్తం సుఖపడుతున్నది పుట్టబోయే పిల్లలకు ఉచిత విద్య, వైద్యం, ఫ్రీగా దేశమంతా పర్యటించి రావచ్చు. కట్టుకున్నదాన్ని సుఖపెడుతున్నామన్న సంతృప్తి కూడా వీటన్నింటికన్నా మిన్నగా మీకు లభిస్తుంది చివరకు. నిజం మాట్లాడితే నేను సుఖపడుతున్నానంటారా ? సుఖమంటే శరీరం డన్‌లప్ పిల్లో మీద ఉండటం కాదు - అది మానసికం, ఆత్మీయం. నిర్మలంగా ఇతరులకోసం, కుటుంబంకోసం, దేశ శ్రేయస్సుకోసం కష్టాలకంకితమైపోయినమీదే నిజంగా దివ్యానందం. నాదేముంది ? ముష్టి బతుకు, పాపిష్టి బతుకు.'

అనురాధ కన్నీళ్ళు కారుస్తున్నది.

అప్పల నరసింహం వెర్రి ముఖం వేసుకొని చూస్తున్నాడు.

' మీకోసం కాదు నాకోసం కాదు - జాతీయ ప్రయోజనాలదృష్ట్యా కూడా కాదు - కనీసం నా కడుపులో ఉన్న మీ ప్రతిబింబంకోసమన్నా మీరీ ఉద్యోగం మానుకోకండి. వాడి భవిష్యత్తుకోసమన్నా మీరీ శ్రమను సంతోషంగా స్వీకరించండి.'

'అలాగే... అలాగే, రాధా' అప్రయత్నంగానే అనేశాడు నరసింహం, అనూరాధ మాటల మంత్ర కవాటంలో సమ్మోహితుడై.

'అలాగని నా చేతిలో చేయి వేయండి.'

చేయి వేశాడు నరసింహం.

అనూరాధ లేచి నిల్చుంది - గీతా ప్రబోధానంతరం క్లైబ్యం వదిలిన నరు నిలా మారాడిప్పుడు నరసింహం - అని అమెకుతెలుసు.

'పదండి భోజనం చేద్దాం.' ప్రేమతో భర్తను డైనింగ్ టేబిల్ వైపుకు నడిపించింది. సముద్రంలోని పడవను కర్ణధారి సురక్షితంగా సున్నితంగా నడిపినట్లు.

అనూరాధ ఆప్యాయంగా ఒక్కో వస్తువునూ పేట్లల్లో వడ్డిస్తూ ఉన్నది.

భర్తకు కర్తవ్యోపదేశం చేసి విజయం పొందినందుకు ఆమె బుగ్గల్లో గర్వం చిందులు తొక్కుతున్నది.

నరసింహం చేతులు కడుక్కొని టవలుకోసం ముందుగదిలోకి వచ్చాడు.

టేబిల్‌పైన తారకానికి తాను ఇందాక వ్రాసిన ఉత్తరం కనపడింది వెక్కిరిస్తూ.

దాన్ని వెంటనే చేతిలోకి తీసుకున్నాడు. చిన్న చిన్న ముక్కలుగా చింపి చెత్తబుట్టలో పడేశాడు.

'మీకు ఆవకాయ వెయ్యమంటారా? వద్దా?' డైనింగ్ టేబిల్ దగ్గరినుండి అనూరాధ కేక.

'వస్తున్నానుండు' టవల్ భుజాన వేసుకొని నరసింహం ముందుకు నడుస్తూ అనుకున్నాడు ఒక్క క్షణం. 'అనూరాధ చెప్పినదంతా నిజమేనా? అబద్ధమా?' ఆమె చెప్పిన మాటల్లో స్వార్థం ఉందో, సత్యం ఉందో మటుకు అంతుచిక్కడంలేదు నరసింహానికి భోజనం చేస్తున్నంతసేపూ ఎంత తీవ్రంగా ఆలోచించినా. అయినా ఈ మెకింత ప్రజ్ఞా, విజ్ఞానం, కవితా కౌశలం ఎలా అల పడ్డాయి? ఏమిధాటి? ఏమి నేర్పు? - అలా ఆలోచిస్తూనే భోజనంచేసి మంచం మీద మేను వాల్చాడు నరసింహం.

వక్కపొడి తమలపాకులూ అందిస్తూ అన్నది అనూరాధ.

'ఈ ఎండలో మ్యాట్నీ కెందుకు? రాత్రికే పోదాము సినిమాకు.'

'ఊం ..'

ఆకులూ పోకలూ నములుతూ అలా నిద్రలోకి వెళ్ళిపోయాడు నరసింహం.

మెలుకువ వచ్చేసరికి డ్రాయింగ్ రూంలో ఏవో మాటలు వినబడు తున్నాయి. ఆలాగే మంచంమీద పడుకొని వింటున్నాడు.

మిసెస్ శామ్యూ్యలూ, ఆమె చెల్లెలూ కబుర్లు చెప్పుకోడానికి వచ్చారు అనూరాధతో.

'నీకేం, అనురాధా! నరసింహం ఈజ్ ఎ జంటిల్ మాన్. మా ఆయన నన్నీమధ్య మరీ కాల్చుకు తింటున్నాడనుకో.' నవ్వుతూ అన్నది సోఫియా శామ్యూ్యల్.

నరసింహం మంచంమీద లేచి కూర్చొని కొంచెం ముందుకు వంగి డ్రాయింగ్ హాల్లోకి తొంగిచూశాడు.

అనురాధ మంగళసూత్రాలు రెండూ కళ్ళకద్దుకొని వినమ్రంగా తల వంచి అంటున్నది. 'ఈజన్మకి వరం చాలు నాకు, సోఫియా! జన్మ జన్మలకూ నాకు వారే పతి కావాలని రోజూ నేను దీపం వెలిగించినప్పుడు వెంకటేశ్వరుణ్ణి తలచు కొని నమస్కరిస్తూ ఉంటాను.'